# హ్యాపీ న్యూ ఇయర్!

## కథ

దాసరి శ్రీనివాసులు



నడుస్తున్నాను-

రాత్రి నుంచి పగటికి. తెల్లవారుజాము నడక. తెల్లవాడి భాషలో 'మార్నింగ్ వాక్'. నడచిన చోటే నడుస్తున్నాను.

చాలా మైలు రాళ్ళు దాటి వచ్చానన్న భ్రమ. కానీ మొదలయిన చోటికే వెళ్ళిపోతున్నాను.

ఆ ఉదయం నగరం బద్ధకంగా వుంది.

క్యాలెండర్లూ, గడియారాల సాక్షిగా గడచిన రాత్రే పాత సంవత్సరంపోయి కొత్తసంవత్సరం వచ్చింది. అంటే ఇప్పుడు నా నడక కొత్త సంవత్సరంలోకి. నాకు నవ్వు వచ్చింది. నేనే కాదు. లోకమే నడిచినచోట నడుస్తోంది.

కొత్త ఏటికి స్వాగతించి అలసిపోయిన సంపన్న నగరవాసులు సుఖనిద్రలో వున్నట్టున్నారు. రోడ్డు మీద పెద్దగా అలికిడి లేదు.

కానీ...ఎక్కడో చిన్న మూలుగు.

నడక ఆగింది. కాళ్ళు ముందుకు వెళ్ళటం లేదు.

వెనక్కి చూశాను.

ఆ స్వరం మనిషిది కాదు. అయితేనేం? ఒక ప్రాణి వేదన. పూర్తిగా ఆగిపోయాను.

ఒకానొక కుక్క.

రాత్రి ఎవడో కారులో దూసుకుపోతూ, ఈ జీవికిలా గాయాల్ని 'న్యూ యియర్ గిఫ్ట్'గా ఇచ్చిపోయాడు.

తేరిపార చూస్తే, అది గాలికి తిరిగే ఊరకుక్క కాదనిపించింది.

నడుము జారినా తీవి పోలేదు. దగ్గరగా వెళ్ళి చూశాను. నా ఊహ నిజమయింది.

జిహెచ్ఎంసి-21 అని దాని మెడకు వేలాడుతున్న బిళ్ళమీద ముద్రించి వుంది.

పెంపుడు కుక్కే.

చూస్తే, కొరప్రాణం కళ్ళవరకూ వచ్చి ఆగినట్టుంది. చుట్టూ కలియ చూశాను. ఎదురుగా తీర్చిదిద్దినట్లున్న ఓ ఇల్లు. 'పాపం! ఆ ఇంటి వారిదే కాబోలు!' అనుకున్నాను.

అంతే వాళ్ళను నిద్ర లేపేశాను. ఎలాగూ తెల్లవారుతోంది కదా - అని.

ఆ ఇంటాయన తలుపు తెరవగానే నా ప్రశ్న సంధించాను.

"అక్కడ పడివున్న ఆ కుక్క మీదేనా..?" అని.

"ఆ కుక్కే కాదు. ఏ కుక్కా మాది కాదు!"

అతడు విసుగుతో వేసిన తలుపుల చప్పుడూ, సమాధానమూ ఏక కాలంలో వచ్చాయి.

ఇలాంటి సమాధానాలే మరి నాలుగు ఇళ్ళల్లో.

ఆ కుక్కమీదే కాదు. నామీద నాకే జాలివేసింది. దానికి గాయాలూ, నాకు చీవాట్లూ.

ఇక లాభం లేదని, రోడ్డు మీదకు అప్పుడప్పుడే వస్తున్న వారినే ఆపాలని నిర్ణయించుకున్నాను.

"ఈ కుక్క చావుబతుకుల్లో వుంది" అని చెబుతుండగానే

మోటారు బైకు ఆపిన వ్యక్తి అడ్డొచ్చి "ఏమిటీ? మళ్ళీ చెప్పండి?" అన్నాడు.

"నేనేమో వాకింగ్‌కి వచ్చాను. నా చేతిలో మొబైల్ కూడా లేదు. ఈ కుక్క చావుబతుకుల్లో వుంది" నేనింకా పూర్తిచేయకుండానే.

"కుక్కా!? మనిషనుకున్నాన్లే!" అని తుర్రుమన్నాడు. అక్కడికి ఈ ప్రపంచం మొత్తం మనుషులదే అయినట్టు, ఇతర జీవులకు స్థానమే లేనట్టు.

నాకు అందరిమీదా నమ్మకం పోతోంది.

ఆ కుక్క నావైపే చూస్తోంది. దానికి మాత్రం నామీద నమ్మకం పెరుగుతోంది.

నాలోకి నేను చూసుకున్నాను.

అవును. నాకు నేను చాలనా? తోడుకోసం వెతుకుతున్నానేమిటి పిచ్చిగా?

అంతే నడక కాస్తా, జాగింగయ్యింది. ఒక్కటే పరుగు. ముందుకి కాదు, వెనక్కి. ఎంత 'కొత్త'లోకి వచ్చినా, కొన్ని అనుబంధాలు 'పాత'లోనే మిగిలిపోతాయి.

మా ఇల్లు వచ్చేసింది. ఏవి కావాలో అవి తెచ్చుకున్నాను. ఇద్దరు పనివాళ్ళు కూడా వచ్చారు.

ఆ కుక్క అంతే నమ్మకంతో నా కోసం చూస్తోంది.

ఆ కుక్క దగ్గరకు వచ్చి పట్టుకున్నాను. అది మూలుగు ఆపింది.

"నోరు తెరిచి పాలు పోద్దాం. కాస్త శక్తివస్తుంది" అన్నాను.

"కరుస్తుందేమో సార్" అన్నాడు ఒక పనివాడు.

"దానికంత ఓపిక లేదులే. నేను నోరు తెరిపిస్తాను. నువ్వు పొయ్యి" అన్నాను.

వాళ్ళు తటపటాయించారు. రెండు పనులూ నేనే చేసుకున్నాను.

'పంటి బిగువున నొక్కిపట్టిన బాధ'ను తొలిసారిగా చూశాను. అది గుటక వేసింది.

ఎందుకో..దాని తలభాగాన్ని నిమరాలనిపించింది. అలా చేస్తుంటే, అది 'కుయ్..కుయ్'మన్నది. అది మూలుగు కాదు. మచ్చిక అయినట్టు ఇచ్చిన సంకేతం.

ఈ లోగా ఇక్కడేదో చోద్యం జరుగుతోందన్నట్లు దారినపోయే వాళ్ళు ఆగుతున్నారు. ఇంతకు ముందు ఆపినా ఎవ్వరూ ఆగలేదు.

అలా కారుమీద వచ్చి ఆగిన ఒక వ్యక్తిని చిన్న సాయం అడిగాను. పారిపోయాడు.

మోటారు సైకిలుమీద వచ్చి, ఆగిన వ్యక్తిని అదే సాయం అడిగే ధైర్యం చెయ్యలేదు. కాకుంటే మాట సాయం చెయ్యమన్నాను.

"అటువైపు వెళ్తున్నారుకదా! ఆటో ఏదయినా వుంటే పంపించు" అన్నాను. అతడు అలాగేనన్నాడు. అన్నంత పనీ చేసేశాడు.

ఆటో వచ్చేసింది.

కుక్క కరవదని నిర్ధారించుకున్న పనివాళ్ళు, కుక్కను ఆటో ఎక్కించటంలో సహాయపడ్డారు.

దాని నడుముకి తడిగుడ్డతో కట్టుకట్టి, ఆటోలో అమిరేలా కూర్చుండ బెట్టాం.

"ఈ కుక్కను బ్లూక్రాస్ వాళ్ళకి అప్పచెప్పాలి. నేనిప్పుడే ఫోన్లో మాట్లాడాను. ఎంత కావాలి?" అన్నాను.

"ఎనభయి" అన్నాడు.


వంద చేతిలోపెట్టి, చేర్పించాక ఫోన్ చెయ్యమని చెప్పాను.


ఆటో కదిలినప్పుడు, ఆ కుక్క వైపు చూశాను. మెడ పైకెత్తి నా వైపే కాదు, అక్కడున్న అందరి వైపూ చూసింది. దాని అసలు రాజసం అప్పుడు కనిపించింది. తృప్తిగా నా నడకను కొనసాగించబోయాను.

"సార్! ఈ కుక్క నాకు తెలుసుసార్" అన్నాడు నిండా పదేళ్ళు లేని కుర్రాడు. సైకిల్ మీద అక్కడ చక్కర్లు కొడుతూ ఆగాడు.

నాకు ప్రాణం లేచివచ్చింది. ఎవరికీ ఏమీ కానీ కుక్కకు తెలిసిన వారొకరున్నారు.

''ఎవరిదీ?'' ఆసక్తిగా అడిగాను.





"ఆ ఇంట్లో అమెరికా వాళ్లుండే వారు. వాళ్ళదే సార్ ఈ కుక్క. దీనికి ఒకసారి కాలు విరిగితే, డాక్టర్లే వాళ్ళింటికి వచ్చి బాగు చేసి వెళ్ళేవారు" అన్నాడు.

"ఆ ఇంట్లో కూడా అడిగాను. వాళ్లకి ఈ కుక్క తెలియదన్నారే!"

"వాళ్ళు ఇల్లు ఖాళీ చేసి రెండు రోజుల య్యింది సార్. వాళ్ళ దేశం వెళ్ళిపోయారు" అని ఇంకా చెప్పబోతుండగానే, ఆ కుర్రాడి తాతయ్య కాబోలు పిలిస్తే తుర్రుమన్నాడు.

'అంత ప్రేమగా పెంచి, ఇలా రోడ్డు మీద వదిలేసి పోయారా? ఇదేమి ప్రేమ?!'

ఇలా అనుకుంటూనే నడక ముగించుకుని ఇంటికి వెళ్ళిపోయాను.

ఆఫీసుకు రెడీ అయ్యేసరికి, డ్రైవరూ వచ్చేశాడు. ఈలోగా ఫోను.

"సార్ నేను. ఆటోడ్రైవర్‌ని. బ్లూక్రాస్ నుంచి మాట్లాడుతున్నాను. పదిన్నరయితేనే కానీ డాక్టర్లు రారని సెక్యూరిటీ వాళ్లు చెప్పారు. ట్రీట్‌మెంట్ ఖర్చు ఎవరిస్తారని అడుగుతున్నారు" అన్నాడు.

ఆటోలో వెళ్తున్నప్పుడు కుక్క ముఖంలోని గాంభీర్యం గుర్తుకొచ్చింది.

"వస్తున్నాను" అని చెప్పి కారెక్కాను.

"సార్..సార్..సార్!" సైకిల్ కుర్రాడు ఈసారి నా కారు చుట్టూ చక్కర్లు కొడుతున్నాడు.

"అమెరికావాళ్ళు మంచివాళ్ళే సార్. ఈ కుక్కను చూసుకోవటానికి బోలెడంత డబ్బిచ్చారు. మా అమ్మ చెప్పింది. కానీ దీనికి రెండురోజులే తిండి పెట్టి తరిమేశాడు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ వార్తను చెప్పినప్పుడు వాడి కళ్ళల్లో మెరుపు కనిపించింది.

నా కారు బ్లూక్రాస్ వైపుమళ్ళింది.

ఆ కుర్రాడి సైకిలు కూడా నన్ను వెంబడించింది.

మేమిద్దరమూ కొత్త సంవత్సరంలోకి వెళ్ళాం. కొత్త అనుబంధంలోకి వెళ్ళాం. కొత్త అనుభూతిలోకి వెళ్ళాం.